కథానిక

# చీకటి

• డా॥ వి.ఆర్. రాసాని
• చిత్రాలు: నర్సిం

ఏడు గుర్రాల రేడు వేట చాలించి చాలాసేపయింది. మసక చీకట్లు కమ్ముకొస్తున్నాయి. మేలిముసుగు కప్పుకుని చీకట్లో నిలబడిన రాచకన్యలా ఉంది నగరం. ఆ చీకట్లో... ఇళ్ళ మధ్యన ఉన్న వేశాలమ్మ గుడి, గంజాయితోటలో పొరబాటున పెరిగిన తులసిమొక్కలాగుంది.

ఆ గుడికి పక్కగా ఓ వెడల్పాటి రోడ్డు. దానికవతల ఏవో కొన్ని పూరిగుడిసెలు, ఆ తర్వాత రకరకాల భవనాలు ఉన్నాయి. అప్పటికే గుడిలోను, గుడిగోపురంపైన ఉన్న లైట్లు వెలుగుతున్నాయి. రోడ్లో చాలా లైట్లు ఉన్నా ఒకే ఒక లైటు మాత్రమే వెలుగుతూ, అది మునిసిపాలిటీవారి చిత్తశుద్ధిని, సామర్థ్యాన్ని చాటుతోంది.

ఆ గుడి చుట్టూ వందగజాల కైవారం ఖాళీ స్థలం. ఆ స్థలంలో గుడికెదురుగా ఓ రచ్చబండ. బండ మధ్యన శిథిలావస్థలో ఉన్న మోడుబారిన పాతకాలంనాటి ఓ వేపచెట్టు. అక్కడే రెండు త్రిశూలాలు. కొంతదూరంలో రోడ్డు ఓరగా ఒక టీకొట్టు, దానికానుకుని సుబ్బరాయుడి బంకు.

ఆ సమయంలో బంకులో కూర్చొని సుబ్బరాయుడు వ్యాపారం చేసుకుంటున్నాడు. గుడి ముందర గడపపైన కూర్చొని ఇద్దరు బైరాగులు తత్వాలు పాడుకుంటున్నారు. పక్కనున్న అరుగుమీద పడుకొని కునికిపాట్లు పడుతున్నాడు - రోజూ అక్కడే పడుకునే అరవై ఏళ్ళ ఉంటలాయన. ఆ గుడి వరండాలో వెలుగుతున్న లైటు కింద కూర్చొని నలుగురు వ్యక్తులు పేకాట ఆడుకోవడానికి ఉపక్రమిస్తున్నారు. ఆ గుడి వెనుక ప్రదేశంలో ఒక యువకుడు పడగ విప్పిన తన కోరికల్ని చల్లార్చుకోవడానికి ఒక వెలయాలితో బేరసారాలు ఆడుతున్నాడు.

బంకు ముందరున్న బెంచీపైన కూర్చొని సుబ్బరాయుడి పదేళ్ళ కొడుకు చిన్నబ్బులు చాక్‌లేట్ నములుకుంటున్నాడు. ఆ సమయంలో అదే వీధిలో ఉన్న సైకిల్ షాప్ ఓనర్ కన్నెముత్తు, స్కూటర్ మెకానిక్ చాంద్ బాషా, వారి మిత్రుడు రాజు మాట్లాడుకుంటూ అక్కడికి వచ్చారు. పొద్దుగూకితే చాలు, అక్కడికి వచ్చి చేరిపోవడం వారికి అలవాటు.

''ఏం సుబ్బరాయుడన్నా! సరుకు దొరుకుతుందా?'' అన్నాడు బంకులో ఉన్న సుబ్బరాయుడితో కన్నెముత్తు.

''చిన్నగా అడుగబ్బా సామీ'' స్వరం తగ్గించి అన్నాడు సుబ్బరాయుడు.

''ఇప్పుడు ఉందా లేదా? అది సెప్పు మామా'' అని చాంద్ బాషా అన్నాడు.

''ఉందబ్బా. తీపు కావాల్నా? చేదు కావాల్నా?'' ప్రశ్నించాడు సుబ్బరాయుడు.

''తీపు దొరకతావుంటే, చేదెందుగ్గానీ... తీపే ఇయ్.'' రాజు అందుకున్నాడు.

''ఎన్ని?''

''ముగ్గురికీ మూడియ్యి'' అని కొంత డబ్బులు జేబులోనుంచి తీసిచ్చాడు కన్నెముత్తు. ఆ డబ్బుల్ని తీసుకొని గల్లాపెట్టెలో వేసుకొని, ఓ మూల ప్రత్యేకంగా ఉంచిన ఒక రేకు డబ్బాలో నుంచి మూడు పొట్లాలు తీసి వాళ్ళకిచ్చాడు సుబ్బరాయుడు. వాటినెత్తుకొని ముగ్గురూ వెళ్ళి రచ్చబండపైన కూర్చున్నారు.

ఆ దృశ్యాన్నే చూస్తున్న చిన్నబ్బులు ''అదేంది నాయనా వాళ్ళకిచ్చినావు?'' అని ఆసక్తిగా అడిగాడు.

''ఏం లేదులేరా!''

''నాకొగ పొట్లం ఇవ్వవా?'' ఏడుపుముఖం పెట్టి అడిగాడు.

''పిల్లోళ్ళవి కాదులేరా అవి. పెద్దోళ్ళవి'' అని, ''సరే. ఇంక పో. ఇంటికి పొయ్యి హోంవర్క్ రాసుకోపో. లేకంటే టీచర్ కొడతాది!'' అన్నాడు సుబ్బరాయుడు.

అతని మాట పూర్తి కాకనే... అక్కడికి వచ్చి ''నిద్దర రాలేదు సామీ... కొంచెం ఆకుంటే ఇయ్యి'' అన్నాడు ఉంటలాయన.

''ఆకులేదు. పొట్లం ఉంది.''



''అదే కాసింత కొట్టు సామీ'' అభ్యర్థించాడు.

''య్యోవ్! పొట్లం ఎక్కువ దుడ్డు లేవయ్యా, యాడిచ్చేది గానీ?''

''డబ్బాలో రాలిపొయ్యిండే ఆకయినా అంత నా ముఖాన కొట్టు సామే!''

''యాడ కొట్టేదయ్యా దినొమ్ము. ఈ మాదిరిగానే పొద్దనా గోజాడీ గోజాడీ అంత తీపే తీసకపోతివి. పెద్ద యాతనై పోయిందే నీతో...''

''ఏం జేసేది సామే... కంటికి కునుకు రాలా... మొనుసేమొ ఉండగుల్లా...''

''అది సరే... పాత బాకీనే తీర్చలా... ఎట్టిచ్చేది నీకు?''

''ఇస్తాలే సామే...''

''ఇల్లూ వాకిలీ లేనోడివి. ఎట్టిస్తావయ్యా?''

''ఎట్లో వొగట్ల ఇస్తాలే సామే.''

''ఏమిస్తావో ఏమొ...''


''నీ బాకీ తీర్చకుండా నచ్చిపోన్లే సామీ ... సామే... పాణం నిలవకుండా వుండాది. అలవాటైపోయిన పాణం. భరించలేకండా ఉండా. ఓ సిటికిడు కొట్టు సామే.''

అతని బాధ చూసి కాస్తా కనికరం కలిగింది సుబ్బరాయుడికి. మరో డబ్బాలో నుంచి చిటికెడు ఆకు తీసి ఇచ్చాడు. దాన్నే మహద్భాగ్యంగా భావించి వెళ్ళి అదే అరుగుపైన కూర్చున్నాడు ఉంటలాయన.

తీపు, చేదు అనబడే ఈ పొట్లాల వ్యాపారం ఈమధ్యనే కొత్తగా ప్రారంభించాడు

సుబ్బరాయుడు. వీటిని అమ్మించేది పెద్ద పెద్ద వాళ్ళయినా అవి అమ్ముడు పోయేది పెద్ద పెద్ద షాపుల్లో కాదు, సుబ్బరాయుడి బంకు వంటి చిన్న చిన్న బంకుల్లోనే. వాటిని అమ్మినందుకు అతనికి మంచి కమిషన్ వస్తుంది. ఆ పొట్లాలను పట్నంలో ఉన్న ఒక ప్రముఖ వ్యక్తి కొడుకు తన ఏజంట్ల ద్వారా ఇలాంటి చిన్న చిన్న బంకులకు, బైరాగులకు, రిక్షా నాయకులకు, కొందరు విద్యార్థి నాయకులకు అందజేస్తుంటాడు. అప్పుడప్పుడు వచ్చి, అమ్మిన సరకుకు తగ్గ డబ్బులు వసూలు చేస్తూ, అమ్మిన వారికి కమిషన్స్ ఇస్తుంటారు ఏజంట్లు. ఇలా ఆ పొట్లాల వ్యాపారం కోసం పెట్టిన ఏజంట్లు వీధి వీధికీ ఉంటారు. ఇలాంటి పొట్లాల వ్యాపారం పట్నంలో... బస్టాండు, రైల్వేస్టేషన్, దేవస్థానం వారి ధర్మసత్రాలు, యూనివర్సిటీ హాస్టల్స్ అందునా ముఖ్యంగా ఇంజనీరింగు హాస్టల్స్, మెడికల్ కాలేజీ హాస్టల్స్, టవున్ క్లబ్ సెంటర్, వేశాలమ్మ గుడి వంటి ప్రదేశాల్లో ఎక్కువ జరుగుతుంది. ఉంటలాయన ఆకు తీసుకుని అలా వెళ్ళగానే రోడ్డుపక్క నున్న ఒక గుడిసెలో నుంచి రోడ్డుపైకొచ్చి "నాయనా! చిన్నబ్బులూ! దారా" అంటూ కేకేసింది సుబ్బరాయుడి భార్య నాగరత్నమ్మ.

''పోరా! అమ్మ పిలుస్తోంది. ఏడు కావస్తోంది గానీ, అంత తిని హోంవర్క్ రాసుకోని పండుకో బో' అన్నాడు ఆ కేక విన్న సుబ్బరాయుడు. దాంతో అక్కడి నుంచి వెళ్ళిపోయాడు అతని కొడుకు చిన్నబ్బులు.



అతనలా వెళ్ళాడో లేదో, చేతిలోని లాఠీని టకటక లాడించుకుంటూ వచ్చి "ఏమయ్యా సుబ్బరాయుడూ నీ వ్యాపారం ఎట్టుండాది?'' అని ప్రశ్నించాడు హెడ్ కానిస్టేబుల్ వెంకటసామి.

'ఈ ముండాకొడుకొచ్చినాడే. ఏదో వొగటి ఇచ్చిందాకా పోడే' అని మనసులోనే అనుకొని పైకి మాత్రం "ఏముండాది సార్. చిల్లర బంకు?'' అన్నాడు.

''సరే... గోల్డ్‌ఫ్లేక్ పేక, ఒక అగ్గిపెట్టె ఇయ్యి.'' చేయి చాచాడు వెంకటసామి.

ఇక తప్పదన్నట్లు బంకులో ఒకవైపు చెక్కపైనున్న పేకల్లోనుంచి ఒక పేక, ఒక అగ్గిపెట్టె తీసి అందించాడు. వాటిని చేతికి తీసుకొని, పేకలో నుంచి ఒక సిగరెట్టును తీసి నోట్లో పెట్టుకొని, అగ్గిపెట్టె గీచి సిగరెట్టును ముట్టించుకొని స్టైల్‌గా పొగను గాల్లోకి వదుల్తూ ''గోల్డ్‌ఫ్లేక్ నిజంగా గోల్డేనయ్యా. బలే మజాగా ఉంటదిలే... వస్తా'' అని ఆ పేకను, అగ్గిపెట్టెను అలాగే ప్యాంటు జేబులో దోపుకుంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయాడు వెంకటసామి. అది రోజూ సుబ్బరాయుడి దగ్గర వసూలు చేసుకునే మామూలు. అయిదు నిమిషాల తర్వాత తిరిగి ఏడ్చుకుంటూ అక్కడికి వచ్చాడు చిన్నబ్బులు.

"ఏమిరా ఏడస్తా వస్తాండావు?'' అని ప్రశ్నించాడు సుబ్బరాయుడు.

''హోంవర్క్ చేయలేదని అమ్మ కొట్టిందీ!'' ఏడుస్తూ చెప్పాడు చిన్నబ్బులు.

''హోంవర్క్ చేయకపోతే ఎట్లరా దొంగనాకొడకా... పో...'' అని కసురుకున్నాడు సుబ్బరాయుడు. ఓదార్చుతాడని ఆశించిన తండ్రి కూడా అలా కసిరేసరికి ఏడుస్తూ తిన్నగా ఉంటలాయన దగ్గర కెళ్ళాడు చిన్నబ్బులు.

అతన్ని చూడగానే "రా నాయనా అబ్బులూ! యాడొద్దురా'' అని పిలిచి పక్కలో కూర్చోబెట్టుకున్నాడు ఉంటలాయన. ఉంటలాయనకు వెనుకా ముందు ఎవ్వరూ లేరు. చిన్నప్పుడే అమ్మా నాన్నలు చనిపోతే ఆ గుడినే ఇల్లు చేసుకుని బతికాడు. ఆ గుడి దగ్గరే తనలాంటి బైరాగుల పుణ్యమా అని గంజాయి కూడా అలవాటైపోయింది. అతని అసలు పేరు ఏదో గానీ, ఒకప్పుడు పుల్లుంటలు, బోండాలు అమ్ముకుంటూ బతికాననీ, ఆ తర్వాత అదే తన పేరుగా స్థిరపడిపోయిందనీ అతనే చెప్పుకుంటాడు.

ఎవ్వరూ లేని ఉంటలాయనకు చిన్నబ్బులుతో ఆడుకుంటూ, పాటలు పాడుతూ కాలం గడపడమంటే ఇష్టం. అలాగే చిన్నబ్బులూ అతను పాడే జానపద గీతాలన్నా చెప్పే కథలన్నా చెవి కోసుకుంటాడు.

చిన్నబ్బులు తన దగ్గరకొచ్చినప్పుడు అతను బంగు తాగుతున్నాడు. గంజాయి గొట్టాన్ని నోట్లో ఉంచుకొని, దాన్ని తన రెండు చేతుల్తో పట్టుకొని ఆకాశం వైపు తలయెత్తి, తన్మయత్వంతో అతను బంగు పీలుస్తున్న దృశ్యాన్ని విచిత్రంగా చూస్తూ కూర్చున్నాడు చిన్నబ్బులు. గుడి వెనుక గోడవైపు రహస్యంగా మాట్లాడుకుంటున్న యువతీ యువకుల మధ్య సయోధ్య కుదిరినట్టుంది. అందుకే కాబోలు ఇప్పుడు వాళ్ళక్కడ లేరు. గుడి వరండాలో కూర్చున్న వ్యక్తులు ఎంతో ఏకాగ్రతతో పేకాటాడుకుంటున్నారు. గుడి మెట్ల పైనున్న బైరాగులు కూర్చునే కునికిపాట్లు పడుతున్నారు. రచ్చబండపైన యువకులు తెచ్చుకున్న పొట్లాలు మింగి, ఆనందంతో కేరింతలు కొడుతున్నారు. ఎవరి ప్రపంచం వారిదిగా, ఎవరి ఆనందం వారిదిగా ఉంది. వాళ్ళంతా డ్రగ్ అడిక్ట్స్! వాళ్ళు వాడే గంజాయికే చేదు, ఆకు అనీ, బ్రౌన్ షుగర్, కొకైన్ వంటి మాదక ద్రవ్యాలకు తీపు, పొట్లం అనీ మారుపేర్లు పెట్టుకుని తీసుకుపోతుంటారు. ఒంటరితనాన్ని భరించలేక ద్రవ్యాలు మరిగాడు ఉంటలాయన. ముప్పై పైబడుతున్నా పెళ్ళికాలేదన్న బాధ కన్నెముత్తుది. చాంద్ బాషాది పెద్ద కుటుంబం. అత్తా కోడలికి క్షణమంటే క్షణం పడదు. అటు తల్లికీ, ఇటు ఆలికీ సర్ది చెప్పలేని బలహీనత అతనిది. వారి సహవాసదోషంతో డ్రగ్స్‌కు లొంగిపోయినవాడు రాజు. అతనికీ గుండెలో ఏదో బాధ పైకి మాత్రం చెప్పడు. అందరికీ ఏదో బాధ. దాన్ని మరచిపోవడానికి ఎండమావులంబడి పరుగు. ఆ పరుగులో ఒక భాగమే ఆ దృశ్యం.

''తాతా! ఒక పాట పాడవా?'' గోముగా అడిగాడు చిన్నబ్బులు.

''పాడతాలే. ఇంకెప్పుడూ యేడవుగదా!'' అని బుజ్జగింపుగా అని పక్కనే ఉన్న తన సంచిలోనుంచి ఢక్కీని పైకి తీసి 'చణక్ చణక్' మని దాన్ని మునివేళ్ళతో వాయిస్తూ... ''ఏం పాట పాడేది సామీ?'' అని అడిగాడు.

'ఆ(' అని రాగం తీస్తూ క్షణంసేపు ఆలోచించి ''నాగులు మొగుడు పాట పాడు'' అన్నాడు చిన్నబ్బులు.

గొంతు సవరించుకుని నుడుగెత్తుకున్నాడు ఉంటలాయన

''వద్దమ్మా ముద్దులగుమ్మా - నాగులు మొగుడు వద్దమ్మా.''

ఆహా - గొంతు వణకింది. సరిగా రాలేదు.

ఢక్కీని కింద పెట్టి సంచిలోనుంచి ఒక చిన్న పొట్లం తీసి అందులో ఓ మూల మిగిలి ఉన్న కాస్తంత తీపు నోట్లో వేసుకున్నాడు. అది నోట్లో పడగానే నరనరంలోనుంచి ఆవేశం తన్నుకొచ్చింది.

"ఏంది తాతా అది?'' అంతవరకు అతన్నే గమనిస్తున్న చిన్నబ్బులు అడిగాడు.

''ఇది బాధలు తగ్గించే మందు. అంతేగాకుండా, అంతేసుకున్నామనుకో సొరగం కనిపిస్తది. దాంతో బాటు పాటా వచ్చేస్తది'' అన్నాడు ఉంటలాయన.

ఆ మాటతో బంకులో ఒకమూల డబ్బాలో ఉన్న పొట్లాలు, వాటిని తీసుకెళ్ళే కస్టమర్లు చిన్నబ్బులు కళ్ళముందు మెదిలారు. ఉంటలాయన తిరిగి ఢక్కీని తీసుకుని వాయిస్తూ పాట పాడసాగాడు.

''వద్దమ్మా ముద్దులగుమ్మా - నాగులు మొగుడు వద్దమ్మా.
వాడు కాలుదీసీ నా కాలుపైనేస్తే - కాడిమానేసినట్టుండెనమ్మా //వద్ద//
హేయ్... వాడు పొట్టదీసి నా పొట్టపైనేస్తే - కపిలబానేసినట్టుండెనమ్మా //వద్ద//''

తన్మయత్వంతో పాడుతున్నాడు ఉంటలాయన. ఉత్సాహంగా వింటున్నాడు చిన్నబ్బులు. అంతలో సుబ్బరాయుడు ''ఒరే అబ్బులూ... ఇట్ట రారా'' అని కేకేశాడు. దాంతో ఉంటలాయన గానప్రవాహానికి గండిపడినట్టయింది.

''ఏం నాయనా'' అంటూ లేచి వెళ్ళాడు చిన్నబ్బులు.

''నేను ఇంటికి పొయ్యొస్తా... కొంత సేపుండు. ఎవురయినా సిగరెట్లు, బీడీలు గట్రా అడిగితే డబ్బులు తీసుకొని ఇయ్యి'' అంటూ లేవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో వచ్చాడు తీపు కోసం మామూలుగా వచ్చే ఇంజనీరింగ్ విద్యార్థి బాలాజీ.

''య్యోవ్! అర్జంటుగా... తీపుంటే ఇయ్యి'' అన్నాడు.

# ENGLISH BY MAIL

గత నాలుగు సంవత్సరాలుగా, విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు మరియు ఉపాధ్యాయులకు ఆంగ్లం బోధిస్తున్న మేము, క్లాసులకు హాజరు కాలేని వారికోసం **'English By Mail'** అనే పోస్టల్ శిక్షణా కోర్సును ప్రవేశపెట్టాం. ఇకమాకు ఇంగ్లీష్ రాదని విసిగి వేసారిన వారెవరికైనా మా మెయిల్ కోర్సు ఓ సదవకాశం. ఈ కోర్సులో

**(1) English 3000**
**(2) Grammar in Use**
**(3) Spoken English**
**(4) Written English**

అనే నాలుగు విభాగాలుంటాయి. **Spoken English** విభాగంలో పుస్తకాలతోపాటు ఆడియో క్యాసెట్స్ కూడా ఉంటాయి. ఈ కోర్సు ముఖ్యంగా తెలుగు మాట్లాడుతూ ఇంగ్లీష్ నేర్చుకోవాలనుకునే వారి అవసరాలను తీర్చేందుకు రూపొందించబడినది. ఒక క్రొత్త భాషను నేర్చుకోవాలనుకుంటే ఏ పద్ధతులను అనుసరిస్తే, ఆ భాషను తేలికగా నేర్చుకోవచ్చు అనే విషయంమీద జాతీయం, అంతర్జాతీయ భాషావేత్తలతో చర్చించి ఒక 'స్కీమ్'ను రూపొందించాం. ఈ 'స్కీమ్'కు అనుగుణంగానే మా మెయిల్ కోర్సును రూపొందించాం. ఈ కోర్సు ఎందరో విద్యావేత్తల, పాత్రికేయుల ప్రశంసలను అందుకొంది. మీరు కూడా మీ అభివృద్ధికి అడ్డుగోడగానిలిచే ఆంగ్లభాషా సమస్యను మా మెయిల్ కోర్సుతో తొలగించుకోవచ్చు.

**Prospectus** కోసం ఈ క్రింది అడ్రస్‌కు ఓ కార్డు రాయండి.


***Director,***
***Campus Institute of English,***
***Hyderabad - 44.***


''అయ్యో లేదు గదయ్యా. అయిపోయింది.'' అన్నాడు సాగదీసి మాట్లాడుతూ.

తగినంత సరకున్నా లేదని చెబుతూ, ఉన్న సరకును ఎక్కువ రేటుకు అమ్ముకోవడం వ్యాపారస్థుల లక్షణం. ఆ లక్షణాన్ని బాగా ఒంట పట్టించుకున్న వాడు సుబ్బరాయుడు. అక్కడికి మామూలుగా వచ్చే కస్టమర్లకు ఆ విషయం బాగా తెలుసు. అందుకే ఇచ్చిందాకా వదలరు. అందుకనే -

''య్యొవ్ ఏమ్యాయొవ్? చూడు... అది పడితే గానీ నా మనసుకు శాంతి లేదు. ఈ బాధకు విముక్తి లేదు'' అని ప్రాధేయపడ్డాడు బాలాజీ.

ఈ విషయాన్నంతా చిన్నబ్బులు ఆసక్తిగా గమనిస్తున్నాడు. కాలనీలో ఓ పేరుమోసిన ఒక సీనియర్ ప్రొఫెసర్ కొడుకు బాలాజీ. అతని తల్లీ ఓ ప్రైవేటు కాలేజీ ప్రిన్సిపాల్. ఇద్దరూ ఉద్యోగస్థులు కావడంతో చిన్నప్పటి నుంచీ బాలాజీని బేబీ కేర్ సెంటర్‌లోనో లేదా ఏదైనా హాస్టల్లోనో పడేసి వెళ్ళిపోయే వారు. పైగా ఎప్పుడూ ప్రతి చిన్న విషయానికీ కీచులాడుకుంటూ అతన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసేశారు. బాలాజీ ఎవరూ పట్టించుకోని పిల్లవాడుగానే పెరిగాడు. ఏనాడూ తల్లి తండ్రుల ఆప్యాయతకూ, అనురాగానికీ నోచుకోలేదు. అతని తల్లితండ్రులకు డబ్బు ఇంకా ఇంకా సంపాదించాలనే బాధ.



వారి మమతానురాగాలు పొందలేక పోతున్నానేనని బాలాజీ బాధ. ఆ బాధ భరించలేకనే అతను డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. యూనివర్సిటీ హాస్టల్స్‌లో డ్రగ్స్ వాడే వారి సంఖ్య ఎక్కువే. అలా ఒక సీనియర్ రిసెర్చి స్కాలర్ ద్వారా బాలాజీకి అవి అందేవి. అతను పిహెచ్.డి థీసిస్ సబ్మిట్ చేసి వెళ్ళిపోయాకా ఎలాగో సుబ్బరాయుడి 'బంకొ విషయం తెలుసుకుని రోజూ తనకు కావలసిన చేదో, తీపో ఏదో ఒకటి తీసుకుపోవడం అలవాటు చేసుకున్నాడు.

చివరికి డబ్బాలో ఉన్న ఓ చిన్న పొట్లం తీసి ''మీలాంటి వారి కోసరమే పెట్టినా... పాపం ఏం చేద్దాం? మీ బాధ చూడలేను. ఎన్ని ఇబ్బందులున్నా... అందుకే ఒకటీ అరా పెట్టుకున్నా. మనుషుల్ని తోసేసుకోలేను గదా!'' అని ప్రజల్ని ఉద్ధరిస్తాననే నాయకుడి లెవల్లో ఓ చిన్నపాటి ఉపన్యాసం ఇచ్చి పొట్లం అతని చేతిలో పెట్టాడు. అతనికి డబ్బులు చెల్లించి ఆనందంగా అక్కడినుంచి వెళ్ళిపోయాడు బాలాజీ.

ఆ తర్వాత సుబ్బరాయుడు పొట్లాలు ఉన్న డబ్బా మూత బాగా బిగించి బంకు దిగి తన ఇంటి వైపు నడచివెళ్ళిపోయాడు. అబ్బులు వెళ్ళి ఆ స్థానంలో కూర్చున్నాడు. కూర్చున్నాడే గానీ, తల్లి కొట్టిన దెబ్బలకు అతని మనసు వికలమైపోయి ఉంది. హోంవర్క్ చేయలేదని టీచర్ కొట్టే దెబ్బలు, ఆడుకోనివ్వకుండా 'రాసుకో, రాసుకో' అని తల్లి కొట్టే తీరు, తండ్రి కసురుకునే వైనం అన్నీ గుర్తుకు రాసాగాయి అతనికి. అవి గుర్తుకొచ్చేసరికి ఏడుపు వచ్చేసింది చిన్నబ్బులుకి. ''లోకంలో అందరూ చెడ్డవాళ్ళే. ఒక్క ఉంటలాయన తప్ప. నా కెవ్వరూ లేరు'' అన్న న్యూనతాభావంకూడా కలిగింది. దానితో ఉంటలాయన చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. తమ బాధలు తగ్గించుకోవడానికి పొట్లాలు తీసుకు వెళ్ళే కస్టమర్లు గుర్తుకు వచ్చారు. అంతే! అతి కష్టం మీద పొట్లాల డబ్బా మూత తీసి, అందులో నుంచి చేతికి దొరికినన్ని పొట్లాలు తీసుకొని నిక్కరు జేబులో వేసుకున్నాడు. ఆ తర్వాత కొంతసేపటికి పని ముగించుకుని తిరిగి వచ్చాడు సుబ్బరాయుడు. అతను వచ్చిందే తడవుగా చిన్నబ్బులు గబగబ బంకు దిగి వచ్చేశాడు.

* * *

అదే రాత్రి తొమ్మిది గంటలు కావస్తోంది.

ఉంటలాయన ఢక్కీ కొడుతూ పాటలు పాడుతూనే ఉన్నాడు.

బైరాగులు రాగాలు తీస్తూ తత్వాలు పాడుకుంటూనే ఉన్నారు.

వరండాలో కూర్చొని ఉన్న నలుగురు పేకాట ఆడుకుంటూనే ఉన్నారు. రచ్చబండ దగ్గర చేరి ఉన్న కన్నెముత్తు, అతని మిత్రులు మత్తులో జోగిపోతూ అడుగులు వేస్తూ ఆనందిస్తూనే ఉన్నారు. ఎవరి లోకంలో వాళ్ళున్నారు. సుబ్బరాయుడు బంకు కట్టేయడానికి తలుపులు మూసి, అడ్డపాలం వేసి దానికి తాళం బిగించాడు. సరిగ్గా అప్పుడొచ్చింది ''ఏమయ్యా! అబ్బులు ఇంటికి ఇంకా రాలేదు?'' అని నాగరత్నమ్మ.

''ఇక్కడినించీ వచ్చేసి గంటపైనే అయిందే. ఎక్కడ బొయినాడో యేమోనే!''

''వాడు మామూలుగా బొయ్యే సోట్లన్నీ తారాడినానయ్యా! యాడా బిడ్డె కనిపించలా. నాకేందో బయ్యంగా ఉంది!'' ఏడుపు లంకించుకుంటూ అంది నాగరత్నమ్మ.

పగలు అప్పుడప్పుడు బంకు కింద కూర్చొని ఆడుకోవడం చిన్నబ్బులు అలవాటు. అది గుర్తుకు వచ్చి బంకు కింద చూశాడు. కనిపించలేదు. అతను ఆడుకునే కోర్టు ఆవరణ, ఫైరాఫీసు ప్రాంగణం అన్నీ వెదికాడు. కానీ, చిన్నబ్బుల జాడే లేదు. చివరికి అటు వెదికీ, ఇటు వెదికీ ఏదో అనుమానం వేసి గుడి వెనుక భాగానికి వెళ్ళి చూశాడు. అంతే! అక్కడి దృశ్యం చూసి అవాక్కయిపోయాడు. అక్కడ చిన్నబ్బులు నేలపైన పడి గింజుకుంటున్నాడు. ఫిట్స్ వచ్చిన వాడికి లాగా చేతులు కాళ్ళు కొట్టుకుంటున్నాయి.

''చిన్నబ్బులూ!'' అంటూ అతన్ని ఒడిలోకి తీసుకున్నాడు సుబ్బరాయుడు. అతని కేక విని ఆ చుట్టుపక్కల వారంతా క్షణంలో అక్కడ చేరిపోయారు. ఏం జరిగిందోనని అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

''వరే. పురుగు ముట్టుకున్నట్టుందిరా_ రొయ్యాసుపత్రికి పదండీ!'' ఆ గుంపులో నుంచి ఒక ముసలాయన తొందర చేశాడు. ''ఎదురు -గుత్తికలు వచ్చినాయేమొ సూడండ్రా.'' మరొకరెవరో అన్నారు. ఇలా ఎవరికి తోచిన విధంగా వారు అంటూనే ఉన్నారు. అతను గింజుకుంటూనే ఉన్నాడు.

ఇంతలో నాగరత్నమ్మ ''నాయనా! కొడకా! ఏం జరిగిందిరా తండ్రీ'' అంటూ లబోదిబోమని రొమ్ములు బాదుకుంటూ ముందుకు వచ్చింది.

వారిద్దరి ఏడుపులతో ఆ ప్రదేశం ప్రతిధ్వనించింది. దాంతో రచ్చబండపైన కన్నెముత్తు మిత్రుల కేరింతలాగిపోయాయి. ఉంటలాయన ఢక్కీ శబ్దం, జానపద గీతం ఆగిపోయింది. వరండాలో ఆ నలుగురి పేకాటా ఆగిపోయింది. అక్కడి బైరాగుల తత్వాలు ఆగిపోయాయి. కానీ, వారి ఏడుపులు మాత్రం ఎక్కువయ్యాయి.

చిన్నబ్బులు చేతిలోని ఖాళీ పొట్లాలు అందరి దృష్టినీ ఆకర్షించడం మాత్రం మానలేదు. అవే అప్పటి అతని స్థితికి కారణమని ఎందరికి తెలుసు? ■